క్లుప్తంగా

మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

వంగర: మండలంలోని సంగాంలో శ్రీసంగమేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. గురువారం ఆలయం వద్ద అధికారులతో సమావేశమైన ఆయన దైవ దర్శనం, స్నానపు ఘాట్ల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్, ఆలయ చైర్మన్ బి.ఆనందరావు, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుదర్శనరావు పాల్గొన్నారు.

రూ.42 లక్షలతో జంగిల్ క్లియరెన్స్

వంగర: మండలంలోని మడ్డువలస దగ్గరున్న గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్ట్ వద్ద చేపడుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ డీఈ రామకృష్ణ గురువారం పరిశీలించారు. దాదాపు రూ.42 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ పనులు నాణ్యతా ప్రమాణాల మేర చేపట్టాలని ఆయన సూచించారు. ఆయన వెంట ప్రాజెక్ట్ డీఈ నర్మదా పట్నాయక్, ఏఈలు అప్పలనాయుడు, నితిన్ ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



రేగిడి దత్తపీఠం సందర్శనలో ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని, అందరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని దత్త పీఠాన్ని సందర్శించిన ఆయన అక్కడ చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఆధ్యాత్మిక గురువు, దత్త పీఠం నిర్వాహకులు కిమిడి సత్యనారాయణనాయుడును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ప్రశాంతతకు మారుపేరు అయిన దత్త పీఠంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్ కె.రవిబాబు తదితరులు ఉన్నారు.

రూ.40 లక్షలతో పైపులైన్ పనులు

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామంలో దాదాపు రూ.40 లక్షల వ్యయంతో తాగునీటి పైపులైన్‌ల ఏర్పాటు పనులు చేపడుతున్నారు. ఈ పనులను గురువారం పరిశీలించిన జెడ్పీటీసీ బండి నర్సింహులు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు ప్రతీ ఇంటికి కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందించాలన్న సదుద్దేశ్యంతో వీటిని ఏర్పాటు చేస్తున్నామని, పనులు సక్రమంగా జరిగేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం

మెంటాడ: మండలంలోని పోరాంలోవ గ్రామంలో ఓ భూస్వామిపై గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి హత్యాయత్నానికి పాల్పడినట్లు ఆండ్ర ఎస్సై సిద్ధార్థ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాకినాడ ప్రాంతానికి చెందిన తిరుమలరాజు జగన్నాథరాజు (73) ఇరవై ఏళ్లుగా పోరాంలోవ లోని భూములు కొనుగోలు చేసుకుని వ్యవసాయం చేసుకుంటున్నాడని తెలిపారు. ఇతనిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయగా.. అపస్మారకస్థితిలో ఉన్న జగన్నాథరాజును పనిమనిషి గుర్తించిందన్నారు. ప్రస్తుతం బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, హత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదని చెప్పారు.

చెరకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం యాజమాన్యం ఆధ్వర్యంలో చెరకు కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీపీ నాగేశ్వరెడ్డి, డీజీఎం కేన్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటైన ఈ కొనుగోలు కేంద్రంతో రైతులకు చెరకు రవాణా చార్జీలు తగ్గడంతో పాటు శ్రమ తగ్గుతుందన్నారు. సర్పంచ్ ఎస్.గోవిందనాయుడు, పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి

బొబ్బిలి: పట్టణంలో తమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించుకోవడానికి స్థలం ఇప్పించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి కోరారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు గురువారం వినతి పత్రం అందించారు. స్థలం కేటాయించడానికి ప్రయత్నిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

మోసాలకు అడ్డుకట్ట..

బొబ్బిలి: ఇంటర్ విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో రికార్డు ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలల మోసాలకు అడ్డుకట్ట వేసి, యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాల జేఏసీ కోరింది. గురువారం స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ, ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పర్యావరణం పరీక్ష తప్పకుండా పాస్ కావాల్సి ఉండడంతో, ఆయా కళాశాలల యాజమాన్యం విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయన్నారు. అధికారులు స్పందించి ఈ విషయమై విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వెంకటరమణ, పట్నాయక్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటిని మొక్కుదాం...



బొబ్బిలి రూరల్: దేవుడు బొడ్డవలస కొండపై పూజలందుకుంటున్న ప్రాచీన విగ్రహాలు



బొబ్బిలి రూరల్: పాల్తేరులో వేగావతి నదిఒడ్డున వెలసిన పార్వతీ మల్లికార్జున ఆలయం



బొబ్బిలి రూరల్: పారాది వేగావతినది ఒడ్డున శివాలయం



బొబ్బిలి రూరల్: చిత్రకోటబొడ్డవలస మానసాదేవి ఆలయం

- శివరాత్రికి సిద్ధమవుతున్న శివాలయాలు
- భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడుతున్న కమిటీ సభ్యులు

బొబ్బిలి రూరల్: శివరాత్రి సందర్భంగా గ్రామాల్లోని శివాలయాలను సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. మండలంలోని పెంట, పారాది, దేవుడు చిత్రకోట బొడ్డవలసల్లో పేరుగాంచిన మూడు శివాలయాలున్నాయి. వీటిలో వేగావతి నది ఒడ్డున పారాది, పెంట గ్రామాలుండగా చిత్రకోట బొడ్డవలస కొండపై దేవుడు బొడ్డవలస ఉంది. అలాగే కలువరాయి రమణమహర్షి ఆశ్రమంలో శివరాత్రిసంబరాలు ఘనంగా నిర్వహిస్తారు.

పెంటలో నగిరేశ్వరాలయం...

పెంట గ్రామంలో ప్రాచీన నగిరేశ్వరాలయం ఉండేది. పురాతనబమైన ఈ శివాలయాన్ని 2013లో కూల్చి నూతన దేవాలయాన్ని నిర్మించారు. 200 ఏళ్ల కిందట వరదల కారణంలో ప్రబలిన రోగాలతో ఎక్కువ మంది ప్రజలు మృత్యువాత పడ్డారు. ఈ సమయంలో గ్రామస్తులు శివుడ్ని పూజించడంతో అప్పట్లో వేగావతీ నది ఒడ్డున స్వయంభూలింగం ఏర్పడిందని, అనంతరం దేవాలయం నిర్మించినట్లు గ్రామస్తుల నమ్మకం. ప్రతి ఏడాదీ కార్తీకమాసం, శివరాత్రికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

దేవుడు చిత్రకోటబొడ్డవలస....

చిత్రకోట పర్వతంపై వెలిసిన శివలింగానికి ప్రాచీన కాలం నుంచి గిరిజనులు, రాజులు పూజలు నిర్వహించేవారని ఈ ప్రాంతవాసుల నమ్మకం. మానసాదేవి ఆలయం ఈ ప్రాంతంలో వెలిసిందని ప్రతీతి. తర్వాత జరిగిన పరిణామాల వల్ల ఈ దేవాలయాలు శిథిలావస్థకు చేరుకోవడం.. అనంతర కాలంలో అలనాటి విగ్రహాలు బయల్పడుతుండడంతో ఈ ప్రాంతంలో చిన్న దేవాలయం నిర్మించారు. ఇక్కడ శివరాత్రికి మూడు రోజుల ఉత్సవాలు నిర్వహిస్తారు. పెద్ద ఎత్తున గిరిజనులు జాతర నిర్వహిస్తారు. రాత్రి కొండపై జాగరాలు చేస్తారు. దీనికి చేరుకోవాలంటే చిత్రకోట బొడ్డవలస నుంచి 3 కిలోమీటర్లు నడిచి వెళ్లాలి.

పారాది....

మండలంలో పారాది శివాలయానికి ఓ ప్రత్యేకత ఉంది. శ్మశానం, వేగావతి నది, శివాలయం ఒకే దగ్గర ఉండడంతో కాశీని పోలి ఉంటుంది. ప్రాచీన ఆలయం అయినా ఎనిమిదేళ్ల కిందట దీనిని పునర్నిర్మించారు. శివరాత్రి రోజున గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి గ్రామమంతా ఐక్యంగా ఉత్సవాలు చేయడం ఆనవాయితీ.

కలువరాయి...

మండలంలో కలువరాయి రమణమహర్షి ఆశ్రమంలో శివరాత్రి సంబరాలు ఘనంగా నిర్వహిస్తారు. రమణమహర్షి ఆశ్రమ నిర్వాహకుడు పరాశర ఎం.రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో కాశీ నుంచి రుద్రాక్షలు తీసుకువచ్చి రుద్రాభిషేకం చేస్తారు. శివరాత్రిరోజు శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తారు. ఈ ఆలయాలే కాకుండా మండలంలో నారసింహునిపేట, పక్కి, అలజంగి, కోమటపల్లి, తదితర గ్రామాలలో కూడా పలు ప్రాచీన శివాలయాలు బాగా ప్రాచుర్యం పొందాయి.

మరో శ్రీశైలం ..

బాడంగి: మండలంలోని పాల్తేరులోని పార్వతీ మల్లికార్జున స్వామి ఆలయం మరో శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంగా పేరుగాంచింది. ఆలయంలో శివలింగంతో పాటు వినాయకుడు, పార్వతీదేవి, ఆదిశంకరాచార్య, వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, అష్టలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణ ఆలయం, గోశాల, నాగదేవతలు, నవగ్రహ, హోమ మంటపాలున్నాయి. శివరాత్రి సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. అలాగే మండలంలోని వేగావతి ఒడ్డున భీమవరం, గొల్లాది విశ్వేశ్వర ఆలయాలు, ముగడ విశాలాక్షి సహిత విశ్వేశ్వరాలయం, బాడంగి ఉమామహేశ్వరాలయం, గజరాయునివలస గిరిజాశంకరాలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి. శివరాత్రి రోజున కోటిపల్లిలో సింహాద్రప్పన్న యాత్ర చేపట్టనున్నారు.

20 ఏళ్ల తర్వాత ఇలాంటి రోజు..

రాజాం/సంతకవిటి: సంతకవిటి, రాజాం మండలాల్లోని ఆలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఈ నెల 18వ తేదీన శివరాత్రి, శనిత్రయోదశి ఒకేరోజున పడడంతో దాదాపు 20 ఏళ్ల తర్వాత వచ్చే ఇలాంటి రోజున పూజలు చేసి, శని వదిలించుకునేందుకు భక్తులు ఉవ్విళ్లూరుతున్నారు. సంతకవిటి మండలంలోని ఎస్.రంగారాయపురంలో పెద్దకొండపై ఉన్న ఈశ్వరినారాయణ ఆలయ సముదాయం శివరాత్రి వేడుకలకు చాలా ప్రసిద్ధి. 12 రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన 12 లింగాలతో బృహదీశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలను ఐదేళ్ల క్రితం ఇక్కడ ప్రతిష్ఠించారు. ప్రతీ ఏడాది జరిగే శివరాత్రి నాడు ప్రత్యేక పూజలతో పాటు యాత్ర కూడా నిర్వహిస్తారు. ఇదే ఆలయ సముదాయంలో ఈశ్వరనారాయణ ఆలయం, శనీశ్వర సహిత నవగ్రహాల మండపం, దుర్గాదేవి ఆలయాలు ఉన్నాయి. ఏటా శివరాత్రి నాడు జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు విశాఖపట్నం నుంచి కూడా ఇక్కడికి భక్తులు వస్తుంటారని ఆలయ ధర్మకర్త పున్నాన నారాయణరావు తెలిపారు. ఆలయ ఆవరణలోని 12 అడుగుల ఎత్తైన నందీశ్వర సహిత శివలింగం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. రాజాంలోని కూరాకుల వీధిలో ఉన్న ఉమారామలింగేశ్వరాలయంలో బొబ్బిలి రాజులు స్ఫటిక లింగం ప్రతిష్ఠించారని ఆలయ అర్చకులు మణికం హరగోపాలశర్మ, శివశర్మలు తెలిపారు.



బొబ్బిలి రూరల్: పెంట నగిరేశ్వరాలయంలో స్వయంభూలింగం



సంతకవిటి: ఎస్.రంగారాయపురంలో ఈశ్వరనారాయణాలయ సముదాయం

మూడు రోజుల జాతర..



పెంట గ్రామంలో స్వయంభూ లింగం ఏర్పడింది. శివరాత్రి సందర్భంగా మూడు రోజుల జాతర నిర్వహిస్తారు. ఇప్పటికే ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశాం. మండలంలో అన్ని ఆలయాల్లో ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి.

– ధూపం వాసు,
సమరసతాసేవా సంస్థ డివిజన్ కార్యదర్శి, పెంట

ఘనంగా శివపార్వతుల కల్యాణం..



కలువరాయిలో రమణమహర్షి ఆశ్రమంలో ప్రతి ఏటా ఘనంగా నిర్వహించే శివరాత్రికి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమా సహస్ర పారాయణం, అరుణాచలం నుంచి తెచ్చిన రుద్రాక్షలకు కలశ పూజ, రుద్రాభిషేకం నిర్వహించడంతో పాటు శివపార్వతుల కల్యాణం జరిపిస్తాం. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– వీవీఎస్ శర్మ,
రమణమహర్షి ఆశ్రమ అర్చకుడు, కలువరాయి



సంతకవిటి: శివరాత్రిపూజలకు సిద్ధం చేసిన బృహదీశ్వర ద్వాదశ లింగాలు



సంతకవిటి: శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన నారాయణేశ్వరాలయం



రాజాంలో తాండ్ర పాపారాయుడు ప్రతిష్ఠించిన స్ఫటిక లింగం

స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి రూరల్: మహిళలు స్వయంసాధికారిత సాధించే దిశగా దృష్టి సారించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సూచించారు. మండలంలోని గున్నతోటవలసలో అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు, అల్లికలు, ఫ్యాషన్ టెక్నాలజీలో ఉచితంగా శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అభిమాని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రెడ్డి రాజగోపాలనాయుడు మాట్లాడుతూ, ఈ సంవత్సరంలో 600 మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి హామీ ఏపీఓ జనార్దనరావు మాట్లాడుతున్న సమయంలో కృష్ణాపురం సర్పంచ్ గంట సింహాచలం తమ గ్రామంలో భైరిసాగరం చెరువు, వీఆర్ఎస్ కాలువ కబ్జాకు గురైందని తెలిపారు. అలాగే మెట్టవలస సర్పంచ్ పువ్వల మాధవరావు మాట్లాడుతూ, ప్రతిఏటా పనులు చేస్తున్నా రైతులకు మేలు జరగడం లేదన్నారు. విద్యుత్‌శాఖ సమీక్షలో అలజంగి సర్పంచ్ రేజేటి భద్రమ్మ, మెట్టవలస సర్పంచ్ పువ్వల మాధవరావు, శివడవలస సర్పంచ్ వి.లక్ష్మీరాణిలతో పాటు పలువురు విద్యుత్ సమస్యలపై ఏకరవు పెట్టారు. సమస్యలు తెలియజేసినా విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ, ఈ ఏడాది ధాన్యం కొనుగోలులో చెల్లింపులు సకాలంలో జరిగాయని, కొద్దిగా మిగిలిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. విద్యుత్‌శాఖ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని సూచించారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి మాట్లాడుతూ, సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను అధికారులంతా పరిష్కరించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతికుమారి, వైస్ ఎంపీపీ డోకుల జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, తహసీల్దార్ ఎస్.రాజారావు, పీఆర్ జేఈ రాజశేఖర్, వ్యవసాయశాఖ ఏడీఏ ఎం.శ్యామ్‌సుందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

బొబ్బిలి: ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ అన్నారు. లేఅవుట్లు, సొంత స్థలాలలో పలు ఇళ్ల నిర్మాణాలకు గురువారం ఆయన భూమిపూజ చేసారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులు మార్చి 22 నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో 12వ వార్డు ఇన్‌చార్జ్ మండల జనార్ధనరావు, 10వ వార్డు ఇన్‌చార్జ్ తుట్ట తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వజ్జి శంకరరావు, దుప్పలపూడి అప్పారావు, రాంబార్కి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడులు



స్వాములకు ఇరుముళ్లు వేస్తున్న గురుస్వామి

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి శివాలయంలో శివస్వాముల ఇరుముడుల కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాలధారణ చేసిన స్వాములు శివరాత్రి నాటికి శ్రీశైలం వెళ్లేందుకు బయలుదేరారు. అంతకుముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం

బాడంగి: విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కులతో పాస్ కావాలంటే తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్. త్రినాథరావు అన్నారు. పాఠశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇకపై పాఠశాలలో అదనపు తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పీఎంసీ వైస్ చైర్మన్ మర్రి శాంతికుమారి, సీఆర్‌పీ సర్వేశ్వరరావు, రమేష్, ఈశ్వరరావు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల శాఖ ఎన్నిక ఏకగ్రీవం

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న కాలనీ పాఠశాలలో గురువారం నిర్వహించిన యూటీఎఫ్ మండల శాఖ ఎన్నిక ఏకగ్రీవమైంది. గౌరవాధ్యక్షురాలుగా బి. విజయమ్మ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.గణేష్, వి.సత్యంనాయుడు, ఉపాధ్యక్షులుగా జి.సింహాచలం, కె.గౌరి, కోశాధికారిగా వి.ప్రవీణ్‌కుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలనాధికారి పక్కి వాసు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు రెడ్డి మోహనరావు మాట్లాడుతూ జీతాలను సకాలంలో చెల్లించాలని, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సామూహిక గృహప్రవేశాలే లక్ష్యం



బాడంగిలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ అప్పయ్య, ఏఓ సత్యం

బాడంగి: ఉగాది నాటికి జగనన్న కాలనీ లబ్ధిదారులు సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు హౌసింగ్ డీఈ పి. అప్పయ్య అన్నారు. గురువారం స్థానిక గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో ఏఈ సత్యంతో కలసి విలేకరులతో మాట్లాడుతూ, బొబ్బిలి నియోజకవర్గంలో మొత్తం 6,295 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 4,341 ఇళ్లు పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన గృహ నిర్మాణాలు కూడా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలాలల్లో నిర్మాణాలు సంతృప్తికరంగా ఉన్నప్పటికీ.. మున్సిపాలిటీ పరిధిలో మాత్రం నత్తనడకన సాగుతున్నాయన్నారు. సమావేశంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటనాయుడు ఉన్నారు.

లోకేశ్ యాత్ర హాస్యాస్పదం



సూరపునాయుడును పరామర్శిస్తున్న రాజగోపాలనాయుడు

రాజాం: టీడీపీ నేత లోకేశ్ చేస్తున్న పాదయాత్ర హాస్యాస్పదమని వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు విమర్శించారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశమైన ఆయన ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి, పట్టభద్రులైన ఓటర్లను గుర్తించాలని, పార్టీ మద్దతు ఇస్తున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన లోకేశ్ పాదయాత్రను తమ పార్టీ పరిగణలోకి తీసుకోవడం లేదని, ఒక లక్ష్యం లేకుండా ఆయన చేస్తున్న పాదయాత్రను రాష్ట్ర ప్రజలు టైమ్ పాస్‌గా భావిస్తున్నారన్నారు. 14 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన ఆయన తండ్రి చంద్రబాబు ఏం అభివృద్ధి చేశారో చెప్పలేని స్థితిలో ఆ పార్టీ క్యాడర్ ఉందని దుయ్యబట్టారు. అంతకుముందు ఓపెన్ స్కూల్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా కో-ఆర్డినేటర్ దూబ సూరపునాయుడును రాజాంలోని ఆయన నివాసంలో కలిసి, పరామర్శించారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న ఆయన ఆరోగ్యంపై ఆరాతీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బి.నర్సింహులు, వైస్ ఎంపీపీ వై.వెంకటేష్, కంచరాం సర్పంచ్ జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహనరావు

సంతకవిటి: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి, పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశమైన ఆయన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, బిల్లలు అందని వారి వివరాలను సేకరించాలని తెలిపారు. అలాగే ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, సర్పంచ్‌లు డి.తిరుపతి, జి. బాబూరావునాయుడు, ఎంపీటీసీ కె. సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

'జగనన్న గోరుముద్ద' బాగుంది..

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలుపై ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం పాఠశాలను సందర్శించిన ఆయన పథకంలో భాగంగా అక్కడి విద్యార్థుల కోసం మెనూ ప్రకారం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూశారు. పదార్థాలన్నీ రుచి, శుచితో ఉన్నాయని, ఇలాగే చక్కగా పనిచేయాలని నిర్వాహకులను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎల్.త్రినాథ్, హెచ్‌ఎం ఎం.రమణమ్మ పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి..

రామభద్రపురం: పదో తరగతి వార్షిక పరీక్షలకు సమయం దగ్గర పడుతున్నందున్న విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డైట్ లెక్చరర్ డి. ఈశ్వరరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఎంఈఓ తిరుమలప్రసాద్, రొంపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం. వేణుగోపాలరావులతో కలిసి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, ఒక ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు సంపాదించవచ్చన్నారు. సాధ్యమైనంతవరకు టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె. కామేశ్వరరావు, టీచర్లు ఎం. నాగభూషణరావు, చప్ప రమణ, కె. దాలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

బొబ్బిలి రూరల్: గ్రామీణ ప్రాంత రైతులు, గ్రామస్తులు డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంపొందించుకోవాలని డీసీసీబీ కౌన్సిలర్ పి.తిరుమలరావు సూచించారు. మండలంలోని కారాడలో నాబార్డు ఆధ్వర్యంలో గురువారం డీసీసీబీ డిజిటల్ లిటరసీ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ రాజగోపాలరావు, డి.తిరుపతిరావు, పీఏసీఎస్ కార్యదర్శి జి.శంకరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ రామాలయ ప్రారంభోత్సవం

బాడంగి: మండలంలోని కోటిపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. బ్రహ్మశ్రీ వేమకోటి మణి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఆయన సోదరుడు వేణుగోపాలనాయుడు, వంగపండు శ్రీరాములు, కొట్నాన రవి, కర్రి ఆనంద్, సర్పంచ్ మార్పిన శ్రీనివాసరావు, బడిగంటి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..

రామభద్రపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ప్రతి ఒక్కరూ ఎలక్షన్ కోడ్ పాటించాల్సిందేనని ఏఈఆర్ఓ, తహసీల్దార్ సుబ్బారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ భానుప్రకాష్‌తో కలిసి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేయనున్న అభ్యర్థులు 23వ తేదీన విశాఖపట్టణం కలెక్టరేట్‌లో నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాలలో వివిధ రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లు తొలగించాలన్నారు.

రైతు సమక్షంలో హద్దుల గుర్తింపు

తెర్లాం: జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో రైతుల సమక్షంలో హద్దులను గుర్తించాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని పూనువలసలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సరిహద్దుల గుర్తింపులో ఎటువంటి తప్పులు జరగకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఆయనతోపాటు వీఆర్‌ఓ నరసింహనాయుడు, మండల సర్వేయర్ ఎం.వెంకటరమణ, రైతులు ఉన్నారు.

పనితీరు మెరుగుపడాలి

మెంటాడ: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పనితీరు మరింత మెరుగుపడాలని జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని పోరాం, పెదమేడపల్లి ఆదర్శ పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, తరగతులు నిర్వహిస్తున్న తీరు, డైలీ పరీక్షలపై ఆరా తీశారు.